విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

మంగళవారం 8 ఏప్రిల్ 2025 8 పేజీలు

కలెక్టరేట్ ప్రజా వేదికకు 480 అర్జీలు

జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

ప్రతి అర్జీకి...
నాణ్యతగా పరిష్కారం చూపాలి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు.

2లో

నగరపాలక చలివేంద్రాల్లో...
చల్లని తాగునీరు అందిస్తాం
● కమిషనర్ ఎన్.మౌర్య

విశాలాంధ్ర -తిరుపతి : వేసవిలో నగర ప్రజలు, యాత్రికుల దాహార్తిని తీర్చేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాల్లో చల్లని(కూల్)నీరు అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రామానుజ కూడలి వద్ద ఏర్పా టు చేసిన చలివేంద్రాన్ని సోమవారం మధ్యాహ్నం కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలు, విచ్చేసే యాత్రికులకు వేసవిలో దాహార్తి తీర్చేం దుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చలివేం ద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. నగరం లోని 12 ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ చలివేంద్రాల్లో చల్లని(కూల్ వాటర్) త్రాగునీరు అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. ఎవరైనా దాతలు ముందుకు వస్తే చల్లని మజ్జిగ కూడా అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని, దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి. ఈ. లలిత తదితరులు ఉన్నారు.

వేసవిలో ముందస్తు
జాగ్రత్తలు అవసరం
– కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర - చిత్తూరు: వేసవి కాలం ప్రారంభం ఐనందున ఎండలు క్రమేపి పెరుగుతున్న సందర్భంగా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సచివాలయం లోని గ్రీవెన్స్ హాల్ నందు వడదెబ్బ, వడగాల్పుల పై ముందస్తు జాగ్రత్త చర్యల పోస్టర్ ను జిల్లా కలెక్టర్,

2

పండుగ వాతావరణంలో
శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఏర్పాట్లు

- 2లో

పేటలో బెల్టు జోరు.!

- కోడి కూయకనే విక్రయాలు షురూ.. అర్ధరాత్రైనా.. యథేచ్ఛగా వ్యాపారం
- దందా సాగుతున్నా మారని అధికారుల పందా..
- ముడుపుల మత్తులో మూగబోతున్నారంటూ యంత్రాంగంపై విమర్శలు

వార్త 2వ పేజీలో

నాణ్యతగా పరిష్కారం చూపాలి

(మొదటి పేజీ తరువాయి) సోమవారం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయమునకు మారు మూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించిన పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక ఆవరణంలో వారు కూర్చోడానికి వీలుగా కుర్చీలు, త్రాగునీటి సౌకర్యం, మజ్జిగ ప్యాకెట్లు వచ్చిన అర్జీదారులకు అందించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్య లపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువు లోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో పాటు డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో అర్జీదారులకు రసీదులు అందించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు : రెవెన్యూ -398, వాటర్ రిసోర్స్ -1, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ -12, పోలీస్ శాఖ -09, ఎస్ఎస్ఎల్ఆర్ -9, పంచాయతీ రాజ్ -24, సివిల్ సప్లై -2, విద్యా శాఖ -2, ట్రాన్స్పోర్ట్ -1, నేషనల్ హైవేస్ -1, ఏపిఎస్పిడిసిఎల్ -5, హౌసి ంగ్ -1, సాంఘిక సంక్షేమ శాఖ -1, గిరిజన సంక్షేమ శాఖ -1, ఐసిడిఎస్ -1, పబ్లిక్ హెల్త్ -6, షుగర్ కెన్ -1, ఎండోమెంట్ -2, టిటిడి -1, మార్కెటింగ్ -1, స్కిల్ డెవలప్మెంట్ -1, వెరసి మొత్తం 480 వినతులు రావడం జరిగిందని సంబంధిత అధికారులు అందరూ వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్క రించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

జాగ్రత్తలు అవసరం

(మొదటి పేజీ తరువాయి) డి ఆర్ ఓ కె .మోహన్ కుమార్,డి ఎం అండ్ హెచ్ ఓ సుధారాణి తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమయ్యిందని ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని, 10 సంవత్సరాల లోపు పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భవతులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వేసవి లో విద్యార్థులకు ఒంటి పూట బడులను నిర్వహిస్తున్నామన్నారు. మధ్యాహ్న సమయం లో విద్యార్థులు బయటకు వెళ్లకూడదని, ఇంటిలోనే ఉంటూ హోమ్ వర్క్ చేసుకోవడం, నిద్రపోవడం వంటివి చేయాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్ళి ఆటలు ఆడటం వల్ల వడదెబ్బకు గురి అయ్యే ప్రమాదం ఉందనన్నారు. వడదెబ్బకు గురైన వారికి ఎక్కువగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్ళు తిరుగుట, విరోచనాలు, వాంతులు, నోరు ఆరిపోవుట, ఆపస్మారక స్థితిలోకి వెళ్ళుట, వంటి లక్షణాలు ఉంటాయి. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లటి, నీడ ప్రదేశంలోకి తీసు కెళ్ళాలని, మెలకువలో ఉంటే ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఓ.ఆర్.ఎస్. ద్రావణం త్రా గించాలన్నారు. ముఖాన్ని చల్లటి నీటితో కడగాలని, గాలి బాగా వచ్చే విదంగా ఫ్యాన్ కింద ఉంచాలన్నారు. 108కి కాల్ చేసి దగ్గర లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలన్నారు. ఉదయం 11గం నుండి సాయంత్రం 4గం వరకు బయటకు అత్యవసరం ఐతే తప్ప వెళ్ళరాదని, వెళ్ళవలసి వస్తే గొడుగు తీసుకెళ్ళాలన్నారు. గంట గంటకు నీరు త్రాగాలని, ఇంటిలో కిటికీలు తెరచి ఉంచాలన్నారు. వదులుగా ఉన్న దుస్తులు మాత్రమే వినియోగించాలని తెలిపారు.

పేటలో బెల్టు జోరు.!

విశాలాంధ్ర - పుత్తూరు: వడమాలపేట మండలంలోని బెల్ట్ షాపులు ఉదయం 5 గంటల నుంచి మొదలై రాత్రి 11,12 గంటల వరకు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ అనుమతితో నడిచే వైన్ షాపులు నిర్ణీత సమయంలో కొనసాగుతాయి. కానీ ఇక్కడ బెల్ట్ షాపులు రాత్రి పగలు తేడా లేకుండా 24గంటలు మద్యం అమ్మకాలు జరుగుతుండడం గమనార్హం. పలు గ్రామలలోని బెల్ట్ షాపుల్లో మాత్రం ఏ మధ్య రాత్రి తలుపు తట్టిన క్షణం ఏటీఎం లాగా కావలసిన మద్యం లభిస్తుంది. అంతేకాకుండా ఇక్కడ డోర్ డెలివరీ సదుపాయాలను కూడా బెల్ట్ షాపుల నిర్వాహకులు చేపడుతున్నట్లు సమాచారం.పలు గ్రామాలలో చూపుకి చిల్లర దుకాణం.. అమ్మేది అక్రమ మద్యం.కొంతమంది పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. మద్యం ప్రియుల బలహీనతలను అసరా చేసుకుని అధిక ధరలకు మద్యం విక్రయించడం జరుగుతోంది.మద్యం మత్తులో ఇళ్ల మధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నా కానీ ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామాల్లో మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కుటుంబ సంసారాలలో మద్యం చిచ్చు విచ్చలవిడిగా దొరుకుతున్న మద్యం కారణంగా పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతుందని, బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడంతో యువత పెడదారి పడుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల కనుసన్నల్లోనే బెల్ట్ షాపులు..మండలంలో పలువురు అధికారుల అండదండలతో వైసీపీ నాయకుల బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు అనధికారిక మద్యం విక్రయాలపై అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

పండుగ వాతావరణంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

విశాలాంధ్ర -తిరుపతి : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవం పండుగ వాతావరణంలో భక్తులందరూ వీక్షించేలా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట లోని పరిపాలనా జరిగిన సమీక్షాలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర విభజన అయ్యాక రాష్ట్ర దేవాదాయ శాఖ నుండి ఒంటిమిట్ట ఏకశిలానగరాన్ని 2015లో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో టిటిడిలో విలీనం చేశారని, అప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో టిటిడి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని గుర్తు చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సూచనలతో తొలిసారి శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. నారా చంద్ర బాబు నాయుడు ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణం వైభవంగా జరిపించాలని, అన్నమయ్య నివసించిన ప్రాంతం కనుక ఇక్కడే టీటీడీ ఆధ్వర్యంలో కళ్యాణం నిర్వహించాలని గౌరవ ముఖ్యమంత్రివర్యులు భావించారని గుర్తు చేశారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పండుగకు ముత్యాల తలంబ్రాలు సమర్పించదానికి ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు వస్తున్నారని వెల్లడించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గట్టుగా టిటిడి , జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను కోరారు. సీఎం గారు వచ్చి వెళ్లేంత వరకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైవే సెక్టార్ లలో తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల నుండి అంబులెన్స్‌లను అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు , డ్రోన్ కెమెరాలు పెంచాలని, వేసవి నేపథ్యంలో ఫైర్ సర్వీస్ మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులు వెలుపలికి సులువుగా వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని, పార్కింగ్ కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఒంటిమిట్ట ఆలయాన్ని ఒక గొప్ప పుణ్య క్షేత్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి మరియు కడప జిల్లా ఇంఛార్జి మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ, అందరూ కలిసి కట్టుగా సమిష్టిగా పనిచేసి శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కల్యాణ వేదిక ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో కల్యాణ వేదిక వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మంత్రులు సూచించారు. గ్యాలరీల్లో భక్తులకు కల్పించాల్సిన వసతులు ఇతర ఏర్పాట్లపై జిల్లా అధికారులతో చర్చించారు. కడప జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని పోలీసులు, టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పటిష్ట బందోబస్తు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా, వాహనాల పార్కింగ్, భక్తుల అవసరాలకు తగినన్ని ఆర్ టిసి బస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కళ్యాణ వేదిక వద్ద బారికేడ్లు, అన్న ప్రసాదము కౌంటర్లు, లైటింగ్, వైద్యశిబిరాలు, మరుగుదొడ్లు, అదనపు పారిశుద్ధ్య సిబ్బంది తదితర అంశాలపై చర్చించారు.సమీక్షకు ముందు కల్యాణోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులకు జిల్లా కలెక్టర్, టిటిడి జేఈవో, జిల్లా ఎస్పీ, టిటిడి సివిఎస్వో లు నివేదించారు. అంతకుముందు కల్యాణ ప్రాంగణం వద్ద భక్తుల కోసం చేపడుతున్న ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, ఎం. రామ్ ప్రసాద్ రెడ్డి, ఎస్. సవిత జిల్లా కలెక్టర్ సి. శ్రీధర్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, టిటిడి జేఈవో వి వీరబ్రహ్మం, సివిఎస్వో హర్షవర్ధన్ రాజు, జిల్లా జాయింట్ కలెక్టర్ సర్వశ్రీ అదితి సింగ్ తదితర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ముందుగా రాష్ట్ర మంత్రులు శ్రీ కోదండరామ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న మంత్రులకు టీటీడీ జెఈఓ వీరబ్రహ్మం, ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ మండపంలో జేఈవో మంత్రులకు శేష వస్త్రం కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. ఈ సమావేశంలో టిడిపి రాజంపేట జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు టిటిడి సీఈ సత్యనారాయణ, ఆర్డీవో జాన్ ఎర్విన్, జిల్లా రెవిన్యూ, పోలీసు, హెల్త్, మెడికల్, తదితర పలువురు జిల్లా, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

నాయుడుపేట ఏఎంసి చైర్మన్ పదవిని అధిరోహించబోయే అదృష్టవంతుడు ఎవరు?

- ముందు వరుసలో గున్నం మధుసూదన్ రెడ్డి

- రెండోసారి తనకే వరిస్తుందని ధీమాగా విజయ్ భాస్కర్ రెడ్డి

విశాలాంధ్ర-నాయుడుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయుడుపేట, పెళ్ళకూరు, ఓజిలి మండలాలకు సంబంధించినటువంటి ఏఎంసీ చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో ఉత్కంఠ ఏర్పడింది. ఈ ఉత్కంఠ తెలుగు తమ్ముళ్లు లో మరింత వేడిని పెంచింది, ఓజిలి మండలానికి సంబంధించిన ఒక నాయకుడు నేను పార్టీ పట్ల విధేయుడుగా ఉన్నానని పార్టీ లైను ఎప్పుడూ దాటలేదని 2024 సార్వత్రికఎన్నికలలో మండల బాధ్యతలు నా భుజస్కందాలపై వేసుకొని ఎటువంటి సమస్య లేకుండా పార్టీ గెలుపుకు కృషి చేశానని, నాకు మద్దతుగా మూడు మండలాలకు సంబంధించిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారని తెలియజేశారు, ఆయన స్థానిక నాయకులతో కలిసి సూళ్లూరుపేట శాసనసభ్యురాలు నెలవల విజయ్ శ్రీ, ఇంచార్జ్ మాజీ ఎంపీ నెల సుబ్రహ్మణ్యం ఇరువురును మర్యాదపూర్వకంగా కలిసి తనకు ఏఎంసీ చైర్మన్ పదవి ఇవ్వాలని గున్నం మధుసూదన్ రెడ్డి కోరారు. ఇది ఇలా ఉండగా నాయుడుపేట పట్టణానికి సంబంధించిన మాజీ ఏం సి చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి తనకే ఏఎంసీ చైర్మన్ పదవివస్తుందని ధీమాగా ఉన్నారు. అని వినికిడి. కొత్తగా రేసులోకి న్యాయవాది ,తెలుగుదేశం పార్టీ నాయకులు పసల గంగా ప్రసాద్ ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఏదేమైనా ఈ నియోజకవర్గానికి గాడ్ ఫాదర్ అయిన కొండేపాటి గంగా ప్రసాద్ మనసులో ఎవరున్నారో వాళ్లకే ఏఎంసీ చైర్మన్ పదవి వరిస్తుందని ప్రజలు చెవులు కోరుకుంటున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు సోమవారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు పౌష్టికా హారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డాక్టర్ సి.ఆర్.రెడ్డి ఆరోగ్య సంజీవని అనే కార్యక్రమం ద్వారా డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారాలతో నిర్వహిస్తున్న మన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, వాకాటి రామ్మోహన్ రావు, పయ్యావుల మురళీనాయుడు, కె.ఆర్.ఎం, కోట వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, నారాయణ, వాకాటి శ్రీనివాసులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర వార్తకు స్పందన

పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర ఎఫెక్ట్ / Visalaandhra EFFECT

విశాలాంధ్ర - చంద్రగిరి: విశాలాంధ్ర వార్తకు స్పందన లభించింది. చంద్రగిరి నడిబొడ్డున చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతలు ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు స్థానిక తోపుడు బండ్ల వ్యాపారస్తులు ఎండ వేడిమికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న వేళ ఈ నెల 1వ తేదీన విశాలాంధ్ర దినపత్రికలో భానుడి భగ భగ లు కనిపించని చలివేంద్రాలు, భానుడి ప్రభావంతో దాహార్తికి అల్లాడుతున్న ప్రజలు అంటూ వార్త రావడం జరిగింది. విశాలాంధ్ర వార్తకు స్పందించిన పంచాయితీ ఇన్చార్జి కార్యదర్శి, ఎంపిడిఓ వెంకటరత్నం నాయుడు సర్పంచ్ రూప రామ్మూర్తి సరైన ప్రదేశంలో అటు ప్రయాణికులకు ఇటు తోపుడు బండ్ల వ్యాపారస్తులకు, యాచకులకు అనువుగా టవర్ క్లాక్ వద్ద సోమవారం ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల మన్నలను పొందారు. మొదటి రోజు కావడంతో చల్లని మజ్జిగ తో సర్పంచ్ రూప రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం నాయుడులు చలివేంద్రం ప్రారంభించారు. వారిని ఆదర్శంగా తీసుకుని మండలంలోని ప్రధాన కూడల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి వేసవి తాపానికి విలవిలలాడుతున్న ప్రజల దాహార్తిని తీర్చాలని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు. రామ్మూర్తి, నాగార్జున, భాస్కర్ రెడ్డి, మేస్త్రి శివ, లక్ష్మి, శంఖర్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీకి ఒక సెంటు భూమి కూడా ఇచ్చేది లేదు

- ఇరుగుళం సమావేశంలో పలు రైతులు ఏకగ్రీవ తీర్మానం

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు మండలం ఇరుగుళం,కొల్లడం, పెద్దఈటిపాకం, రాళ్లకుప్పం గ్రామాల్లో ఏపీఐఐసీ ద్వారా సేకరిస్తున్న బలవంతపు భూసేకరణను మానుకోవాలని పలువురు రైతులు కోరారు. ఈ ప్రాంతంలో రెండో విడత భూసేకరణకు సంబంధించి ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిన నేపథ్యంలో సోమవారం ఇరుగుళం గ్రామంలో పలువురు రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు విజయశంకర రెడ్డి, బాలసుందరం రెడ్డి మాట్లాడుతూ ఏపీఐఐసీకి ఒక సెంటు భూమి కూడా ఇచ్చేది లేదన్నారు. గతంలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటు సమయంలోనే పారిశ్రామిక వాడకు భూములు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో 2007లో మొదటి దశ భూ సేకరణ సందర్భంగా ఇరుగుళం, కొల్లడం, పెద్ద ఈటిపాకం తదితర గ్రామాల్లోని రైతులు భూములు ఇవ్వకపోవ డాన్ని వారు గుర్తు చేశారు. దీనిపై అనేక పోరాటాలు, ఆందోళనలో కూడా చేయడం జరిగింది అన్నారు. దీంతోపాటు మొదటి దశ భూసేకరించి మినహాయించాలని అప్పట్లోనే రైతులు పలువురు కోర్టును కూడా ఆశ్రయించినట్లు గుర్తు చేశారు. పైగా ప్రస్తుతం భూముల విపరీతంగా పెరగడంతో ఏపీఐఐసీకి భూములు ఇవ్వడానికి ఎవరు ముందుకు వచ్చే ప్రసక్తే లేదన్నారు. ఒక ఇరుగుళం గ్రామంలోని దాదాపు 1100 ఎకరాల వరకు ఉన్నట్లు వారి వివరించారు. బలవంతపు భూసేకరణ చేపడితే రైతులందరూ ప్రతిఘటించడం జరుగుతుందన్నారు. అందువల్ల ఈ ప్రాంతంలో భూసేకరణను ఆపాలన్నారు. పైగా ఇప్పటికే ప్రత్యేక ఆర్థిక మండలిలో ఇంకా 40 శాతం భూములు ఖాళీగా ఉండగా మళ్లీ మూసాకన్ ఎందుకని వారు ప్రశ్నించారు. ఈ మేరకు రైతులు పలువురు ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. ఇక్కడ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు చెప్పారు. ఈ సమావేశంలో రైతులు శ్రీరామచంద్ర రెడ్డి, నిరంజన్ రెడ్డి, సుశీల్ కుమార్ రెడ్డి, మునిచంద్రారెడ్డి, ప్రతాపరెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవి రెడ్డి, మురళినాయుడు, రజనీకాంత్, రాజేష్, మనోజ్, ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ఎం గ్రేడ్ - 2 సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: జేఎల్ఎం గ్రేడ్ - 2 సమస్యలను పరిష్కరించాలని సోమవారం గ్రామ, వార్డు, సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు కోరారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఆధ్వర్యంలో సోమవారం పురపాలకసంఘ కమిషనర్ గిరికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గురవయ్య మాట్లాడుతూ సచివాలయ సర్వేల నుంచి జేఎల్ఎం గ్రేడ్2లను మినహాయింపు ఇవ్వాలన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ముని హరికృష్ణ, పవన్ కల్యాణ్, తమీమ్, చాంద్‌బాషా, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమ వారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసు పు, కుంకుమ, విభూధి వంటి వాటితోఅభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

"ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక భవిష్యత్తు"

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ డాక్టర్ విజయ చందర్ ఆధ్వర్యంలో "ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక భవిష్యత్తు" అనే నినాదంతో ర్యాలీ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించుట కొరకు శారీరక మానసిక సామాజిక ఆధ్యాత్మికంగా రాణించాలం టూ, పోషకాహార విలువలు కలిగిన ఆహారాన్ని తింటూ,యోగ, ధ్యానం, సంగీతం, చిత్రలేఖనం, శిల్పకళలు, ఆటలు, పాటలు, వంటివి అలవర్చుకోవాలని అన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యము, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలియజేశారు. పోషకాహారంలో భాగంగా పిండి పదార్థాలు విటమిన్లు పండ్లు పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించాలని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. సిహెచ్ఓ అనురాధ సూపర్వైజర్లు గోపి పుష్పలత ల్యాబ్ టెక్నీషియన్ జిలాని ఫార్మసిస్టు సారామతి స్టాఫ్ నర్స్ లక్ష్మీ మరియు అర్బజాన్ ఆశా వర్కర్లు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారు.

ఘనంగా ఆదిమూలం జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో సోమవారం సత్యవేడు నియోజకవర్గం శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం జన్మదిన వేడుకలను సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు కేక్ కట్ చేసి అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా సముద్రాల రవి నాయుడు, కందేరి కార్తీక్ నాయుడు లు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం ప్రజా సేవలో తనకంటూ ఓ ముద్ర వేసుకున్నారన్నారు. ఆయనకి ఎన్నో శ్రమలు వచ్చినప్పటికీ శ్రమలను తట్టుకొని వివాదాల మధ్య రాటు తేలి ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో తెలుగుదేశం పార్టీలో ప్రత్యేకమైన ముద్ర వేసుకున్నాడు. నియోజ కవర్గంలో తనదైన శైలిలో నడిపించడం హర్షదాయకమన్నారు. ప్రజలకు అరటి పండ్లు అన్నదానం చేశారు. ఆయన పేరిట పూజ పురస్కారాలు చేసి చాక్లెట్లు అరటి పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మన్మధ, నాని, సురేష్ యాదవ్, రామనాథం, చింతపూడి భూపయ్య, పెద్ద ఎత్తున తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు.

రవి యాదవ్‌ను సన్మానించిన మైనారిటీ నాయకులు

విశాలాంధ్ర - కార్వేటినగరం: కార్వేటి నగరం పట్టణంలోనే వెలసి ఉన్న శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి ఆలయ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మేళం రవి యాద వ్‌ను ఘనంగా మైనారిటీ నాయకులు, ఆటో డ్రైవర్లు సోమవారం సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో షేక్ సంధాని, జయ, జిలాని భాష, రమేష్, యాకూబ్, సుధాకర్, ఫయాజ్, ప్రవీణ్, కలందర్, సురేష్, శీను తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ పరంధాం, రుక్కు బాబు, ఏకాంబరం తదితరులు ఆధ్వర్యంలో ఘనంగా రవి యాదవ్ సన్మానించారు.

చోరీ కేసులో నిందితునికి 6 నెలలు జైలు

విశాలాంధ్ర - గూడూరు : చోరీ కేసులో నిందితునికి 6 నెలలు జైలు శిక్ష , పది వేలు జరిమానా విధిస్తూ గూడూరు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి. లోకనాథం తీర్పు నిచ్చారు. గత ఏడాది ఆగస్టు 25 వ తేదీన గూడూరు మండల పరిధిలోని తాళ్లమ్మ గుడి వెనుక ఉన్న బండి సుబ్రమణ్యం పొలములో ఉన్న షెడ్ లో రాగి వైరు , పైపులు , ఐ రన్ షీట్‌లును చల్లా శీనయ్య చోరీ చేశాడు.అప్పట్లో గూడూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో రూరల్ ఎస్. ఐ మనోజ్ కుమార్ కేసు నమోదు చేశారు. నిందుతుడు చోరీ చేసినట్లు నేరం రుజువు కావడంతో 6 నెలలు జైలు శిక్ష , పది వేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పును ఇచ్చారు. ఈ కేసును ఏ.పి.పి లక్ష్మీ నారాయణ వాదించారు.

తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- ఆరోగ్య శాఖ అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' అవగాహన ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నందు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భముగా డీఎంహెచ్వో బాలకృష్ణ నాయక్ మాట్లాడు తూ తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారించి నివారిం చదగిన మరణాలను, మహిళల దీర్ఘ కాలిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. తల్లి, పిల్లల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి 'ఆయుష్మాన్ భారత్' 'జాతీయ ఆరోగ్య మిషన్' వంటి కార్యక్రమాల ద్వారా సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. గర్భిణీలకు పోషకాహారం, విశ్రాంతి, గర్భ ధారణ ప్రమాద సంకేతాలు, గర్భ సమయములో తీసుకొన వలసిన జాగ్రత్తల పై అవగాహన తెలిపజేయటం జరుగుతు ఉదన్నారు. రక్త హీనత్ ముక్తి భారత్ ద్వారా కౌమార దశలో ఉన్న వారికి, గర్భిణి స్త్రీలలో రక్తహీనత నిర్ధారణ, చికిత్స వంటి సేవలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. పున రుత్పత్తి, శిశు ఆరోగ్యం పోర్టల్ గర్భిణి స్త్రీలు, నవజాత శిశువులను ట్రాక్ చేయ డానికి ప్రసవానికి ముందు ప్రసవం, ప్రసవానంతర సేవలు సకాలంలో అందజేయడానికి తోడ్పడుతుందని తెలియజేసారు. అలాగే ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నినాదమైన 'ఆరోగ్య కరమైన ఆరంభం ఆశా జనక భవిష్యత్తులు' అనే ఈ నినాదాన్ని ప్రజలలో తీసుకెళ్ళాలని తెలిపారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి స్విమ్స్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్‌ఆర్ రెడ్డి, మెటర్నిటి హాస్పిటల్ ఆర్‌ఎమ్ఓ, డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, డిఎల్ఎటిఓ, డాక్టర్ పద్మావతి, ఎపిడెమాలజిస్ట్ డాక్టర్ లావణ్య, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్స్, కిరణ్ కుమార్ డిప్యూటీ డెమో ఇతర సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొట్టు కౌశల్య అనారోగ్యంతో మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి మండలం ముంగిలిపట్టు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జలజ అత్త బొట్టు కౌశల్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని స్థానిక నాయకులతో కలసి బొట్టు కౌశల్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, చంగమనాయుడు, చినరాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం హామీతో గృహం, ఆర్థిక సాయం మంజూరు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి జిల్లా లో తిరుచానూరు నందు ఏజి - పి ప్రథమ్ - థింక్ గ్యాస్ కంపెనీ వారి డొమెస్టిక్ పైప్లైన్ సహజ వాయు సరఫరా ప్రారంభ కార్యక్రమ పర్యటన నేపథ్యంలో ఈ సంవత్సరం జనవరి 12న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గృహ సందర్శన సమయంలో కుటుంబంలోని మహిళ కె. లీలావతి, భర్త శరవణ తమకు ఇల్లు మంజూరు చేయమని, ఆర్థిక సహాయం చేయాలని కోరగా సిఎం సమ్మతించి తగు చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్‌కి ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సోమవారం సదరు గృహిణి లీలావతి దంపతులకు లక్ష రూపాయల చెక్కును గృహ మంజూరుతో అందించారు. సదరు దంపతులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణం లోని గోకుల్ సర్కిల్ నందు రోడ్డుపై నడుచుకుని వెళుతున్న గుర్తుతెలియని మహిళను ఒక యువకుడు అతివేగంగా ద్విచక్ర వాహనంలో వస్తూ ఆమెను ఢీకొనడంతో ఆమె కింద పడిపోవడం జరిగింది ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించడం జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

విశాలాంధ్ర-పుంగనూరు: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది మండలంలోని కొండ సముద్రం గ్రామానికి చెందిన గంగులప్ప సతీమణి కవిత 45 నాలుగు రోజులు కిందట కర్ణాటకలోని తన అక్క ఇంటికి వెళ్లి మనకు రావలసిన లక్ష 70 వేల రూపాయలు తీసుకుని వస్తానని తన భర్తకు చెప్పి వెళ్లి గత నాలుగు రోజులుగా కనపడకపోవడంతో తన భర్త బంధువులతో కలిసి చుట్టుపక్కల వెదకడం జరిగింది కానీ సోమవారం ఉదయం గ్రామ సమీపాన ఉన్న కోళ్ల ఫారం ఎదుట ఉన్న చెట్టులో ఉరి వేసుకుని వేలాడుతూ అనుమానాస్పద స్థితులో మృతి చెందడం జరిగింది గ్రామస్తులు పోలీసులుకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పంచనామ నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించడం జరిగింది దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంగమ్మ తల్లిని సొంత ప్రచారానికి వాడుకున్నారు: ఎమ్మెల్యే ఆరణి

విశాలాంధ్ర-తిరుపతి: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిశీలించారు. ఈఓ జయకుమార్, ఇంజినీరింగ్ అధికారులు ఆలయంలో జరుగుతున్న పనుల తీరును ఎమ్మెల్యే కు వివరించారు. ఆలయం లోపల జరుగుతున్న క్యూ లైన్ పనులను మొదట ఎమ్మెల్యే పరిశీలించారు. రెండు వందలు, ఉచిత దర్శనం లైన్లలో వచ్చే వారికి అమ్మవారు బాగా కనిపించేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఈఓను ఎమ్మెల్యే ఆదేశించారు. మూడు వందల రూపాయల భక్తుల లైన్ సాఫీగా వెళ్ళేలా చూడటంతోపాటు అమ్మవారు కొలువైన ప్రాంతంలోకి ఎటువంటి పరిస్థితుల్లో వెలుపలి వ్యక్తులను అనుమతించరాదని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే ఆలయ ఆవరణలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. జాతర చాటింపు నాటికి పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆలయంలో ప్రస్తుతం దేవాదాయ శాఖ, టిటిడి ఇచ్చిన సుమారు ఆరు కోట్ల రూపాయల పనులు సాగుతున్నట్లు ఈఓ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వచ్చే నెలలో జరగనున్న గంగ జాతరను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సామన్య భక్తులకు శీఘ్రగతిన అమ్మవారి దర్శం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వివిఐపిలు వారికి కేటాయించిన సమయంలో అమ్మవారి దర్శనం చేసుకోవాలని ఆయన కోరారు. జాతరలోపు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. గత ఐదేళ్ళలో గంగజాతరను సంప్రదాయాలను పక్కన పెట్టి ఇష్టానుసారం నిర్వహించారని ఆయన చెప్పారు. సొంత ప్రచారానికి గంగమ్మ తల్లినీ వదల లేదని ఆయన ఆరోపించారు. అయితే ఎన్డీఏ కూటమి పాలనలో అమ్మవారి జాతరను సంప్రదాయబద్దంగా నిర్వహించి అందరి మన్ననలను పొందుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు మహేష్ యాదవ్, రాజా రెడ్డి, కెఎంకె లోకేష్, బాబ్జీ, ఆర్కాట్ కృష్ణప్రసాద్, రాజేష్ ఆచ్చారి, ఆముదాల వెంకటేష్, ఆళ్వార్ మురళీ, చందు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: గ్రామీణ పొదుపు మహిళ వార్షిక ఋణం జీవనోపాదుల బలోపేతానికి పొదుపు సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి పరచడానికి కూటమి ప్రభుత్వం కొత్త నిబంధనలతో జీవనోపాదులు కల్పించాలని జియో ట్యాగ్ ద్వారా పొదుపు సంఘాలను అభివృద్ధి పరచుటకు సోమవారం మండలంలోని తీమభూపాలపురం, వెలుగు సమైక్య అధికారులు ఏపిఎం మునెయ్య పొదుపు సంఘాల వార్షిక ఋణం మరియు జీవనోపాదుల ప్రణాళిక తయారు చేయడం పై అంకమ్మ సంఘం సభ్యులతో ఎన్యూమరేట్, వి.ఒ.ఏ లు పలు విషయాలు చర్చించిన నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలో 28 పంచాయతీలలో ఈ ప్రక్రియ మొదలైందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుస్తుండగా.. సంఘాలను మరింత పటిష్ఠం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మహిళా సంఘాల వివరాలను నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఈ ఏప్రిల్ మాసం నుంచి కొత్త పద్ధతులు మారాయన్నారు. ఇక నుంచి పొదుపు సంఘాల వివరాలు ఒకే యాప్‌లో పొందుపర్చనున్నారు. దీంతో పొదుపు సంఘాల లెక్కలు పక్కాగా ఉంటాయన్నారు సంఘాల పనితీరు ఆర్థిక లావాదేవీలు, మహిళలు పొందుతున్న రుణాలు, వారు చెల్లిస్తున్న వడ్డీ, ఇతర వివరాల నమోదుకు ప్రభుత్వం అందించబోయే యాప్ ద్వారానే సేకరించి పొందుపరుస్తారన్నారు. పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు సర్కారు కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత ఉండేలా యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లిస్తున్న వాయిదాలకు సంబంధించిన వివరాలను ఈ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఎక్కడా లోపం లేకుండా పర్యవేక్షణ సులువుగా మారుతుందన్నారు. పొదుపు సంఘాలకు అవగాహన కల్పించారు.

శ్రీ గాయత్రిలో గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణం లోని శ్రీ గాయత్రీ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథిగా గూడూరు పట్టణ యస్.ఐ. తిరుపతయ్య పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. తిరుపతయ్య మాట్లాడుతూ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం వల్ల వారిలో స్ఫూర్తి పెరిగి భవిష్యత్తులో చక్కటి పౌరులుగా రాణించబడుతారని కొనియాడారు. విద్యార్థులకు చిన్ననాటి నుండే నైతిక విలువలు, నిజాయితీ గా ఉండడం, క్రమశిక్షణ నేర్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమములో శ్రీ గాయత్రీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి, ఉపాధ్యాయులు మస్తాన్బీ, ఉమా మహేశ్వరి, హరిత, జ్యోతి స్వరూప్, మునిరాజా, నసీరా, రమ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర-సత్యవేడు: నవజాత శిశు మరణాలను అంతం చేయడానికి మహిళల ఆరోగ్యం పట్ల ప్రాధాన్యత ఇవ్వాలని సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ చెప్పారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి మూలస్తంభమైన తల్లి బిడ్డ సంరక్షణ ముఖ్యమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏడాది ఏప్రిల్ ఏడవ తేదీన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అయితే ఆరోగ్యకర సమాజం కోసం ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు.దీంతోపాటు ఆరోగ్యకరమైన గర్భాలు, జననాలతోపాటు ప్రసవానంతరం ఆరోగ్యానికి మద్దతు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ సుబ్రమణ్యం, సూపర్వైజర్ నాగజ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, ఎంఎల్ హెచ్పి మహాలక్ష్మి, భానుమతి, పవన్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అభివృద్ధే మా లక్ష్యం: పులివర్తి సుధా రెడ్డి

విశాలాంధ్ర-చంద్రగిరి: మహిళల అభివృద్ధే మా లక్ష్యమని చంద్రగిరి శాసన సభ్యులు పులి వర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి తెలిపారు. చంద్రగిరి దాసరి వీధి, జమండ్ల వీధిలో సోమవారం ఆమె మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సుధా రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలు, స్వయం ఉపాధి, సంఘాల ద్వారా పూర్తి మద్దతు కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలు, టైలరింగ్, అల్లికలు, డ్రైవింగ్, సెల్‌ఫోన్ రిపేర్ వంటి కోర్సులకు ఉచిత శిక్షణతో పాటు శక్తి యాప్, 1002 అత్యవసర నెంబర్ ద్వారా మహిళల భద్రతపై తెలుగుదేశం పార్టీ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రేషన్ కార్డు, పెన్షన్, ఇంటి స్థలాలు వంటి సమస్యలకు సచివాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. త్రాగునీరు, సైడ్ కాలువలు, అండర్ డ్రైనేజీ, వీధి లైట్లు, సిమెంటు రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే తగిన చర్యలు తీసుకొంటున్నారని దశల వారీగా హామీలన్నీ నెరవేరుతాయని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కారమే లక్ష్యం అని ఆమె హామీ ఇచ్చారు. దాసరవీధిలో స్థానికుల సమస్యలు తెలుసుకొని ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసికెళ్లి పరిష్కరించడానికి క్రుషిచేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమన్నారు. పార్టీలకు అతీతంగా చంద్రగిరి అభివృద్ధికి కృషిచేస్తామని, మహిళల్లో చైతన్యం, ఆత్మస్థైర్యం నింపే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహణ అన్నారు. గత ప్రభుత్వంలో కన్నా గంజాయి చాలా వరకు తగ్గింది. పూర్తి నిర్మూలనే లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం గోవింద ధామం కొరకు భూమి పూజ ఎమ్మెల్యే చేయనునున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

పురస్కారాలు ప్రతిభకు దర్పణాలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు రెండవ పట్టణం మాళవ్య నగర్‌లోనీ శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు 2024-25 సంవత్సరానికి గాను అత్యుత్తమ మేధా శారీరక ప్రవర్తనా ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు పట్టణ ప్రముఖ యోగ అధ్యాపకులు రాజా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మేదస్సు సరిగా పనిచేయాలి అంటే శారీరక వ్యాయామం ఉండాలని అందుకు యోగాసనాలు ప్రముఖంగా ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు శారీరక ఆకృతితో పాటు మేధస్సు అభివృద్ధి చెంది తమ విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తారని పేర్కొన్నారు. మంచి పోషకాహారాన్ని తల్లిదండ్రులు అందించాలని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి రాజన్న యొక్క సూచనలు పాటిస్తే మన ఆరోగ్యం ఎంతో బాగుంటుందని యోగా వలన అనేక సమస్యలు, రోగాలు తగ్గుతాయని, మానసిక ప్రశాంతత దొరుకుతుందని తెలిపారు. ఈ వేసవి సెలవులలో పిల్లలకు భవిష్యవాణి అనే ఒక పుస్తకాన్ని ఇస్తామన్నారు. అందులో సూచనలు తప్పకుండా పాటించే విధంగా తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని వారితో సంయమనం పాటిస్తూ వారి దగ్గర ఆ పనులు చేయించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సి.డి. సునీల్ రాజు అకడమిక్ కో-ఆర్డినేటర్ కె.హరికృష్ణ, ప్రైమరీ ఇన్ - చార్జ్ సి.సింధు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుండే లోకజ్ఞానం కలిగి ఉండాలి

సాంస్క్రిట్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి

విశాలాంధ్ర-తిరుపతి: విద్యార్థి దశ నుండే లోకజ్ఞానం కలిగి ఉండాలని నేషనల్ సాంస్క్రిట్ వర్సిటీ జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక నలంద మార్గ్ కట్టు కింద పల్లి లో ఉన్న నలంద హై స్కూల్ 35వ వార్షికోత్సవం కచ్చపి కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి, నలంద పాఠశాల కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి, ఆనంద్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలన్నారు. విద్యార్థుల చదువు విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై దృష్టి పెట్టి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యార్థులు సోషల్ మీడియాలకు బానిసలు కాకుండా తగు జాగ్రత్తతో వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను ఎదగాలన్నా, ఉన్నత స్థాయిలో ఉండాలన్నా సరే ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో పాటు తల్లిదండ్రుల పెంపకం చాలా ముఖ్యం అని అన్నారు. డైరెక్టర్స్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ పట్టదలతో చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. చదువుతోపాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని అన్ని రంగాల్లో రాణించాలని విద్యార్థి దశనుండే సామాజిక స్పృహ లక్ష్యాలను అలవర్చుకోవాలని ఇతరులకు సహాయ పడగ గుణములను పెంపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదివినప్పుడే భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అవుతుందని తెలిపారు. మా పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నా మని అని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టే విధంగా నడవడిక ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మునికృష్ణ, రవీంద్రనాథ్ రెడ్డి, భాస్కర్ రాజు, సుబ్రహ్మణ్యం రాజు, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలను పాటించండి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: ప్రతిఒక్కరు ఆరోగ్య నియమాలను పాటించాలని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రధాన వైద్యులు హేమశ్రీ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్యదినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏ తల్లి జన్మనిస్తూ మరణించకూడదు, ఏ బిడ్డా జన్మిస్తూ మరణించకూడదు అని అన్నారు. అందుకోసం ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ప్రారంభం ఆశాజనక భవిష్యత్తు అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఈశ్వరమ్మ, లాబ్ టెక్నీషియన్ డేవిడ్, ఫార్మాసిస్ట్ పుష్ప,స్టాఫ్ నర్స్ దిలీప తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన చిత్తూరు ఎంపి

విశాలాంధ్ర-చిత్తూరు: గంగాధర నెల్లూరు నియోజకవర్గం, పెనుమూరు మండలం, చిన్న కలికిరి పంచాయతీ, చిన్న కలికిరి గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ బూత్ కన్వీనర్ ఆర్ చిట్టికి చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు బాసటగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందిన 1,86,210 రూపాయల చెక్కును, సోమవారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో అందించి, బాధితుడికి అండగా నిలిచారు. పార్టీ బలోపేతానికి పనిచేయడంతో పాటు, ప్రభుత్వం అందించే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ, బాధ్యతతో సేవ చేసే నాయకులు, కార్యకర్తలకు అటు పార్టీ ఇటు ప్రభుత్వం చేయూత నివ్వడంలో వెనకాడదన్నారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి భూత్ కన్వీనర్ ఆర్.చిట్టి.. చుడా ఛైర్పర్సన్ కఠారి హేమలత, చిత్తూరు పార్లమెంటు జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప, పెనుమూరు మండలం తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, టిడిపి యాదవ సాధికార సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, బీసీ సెల్ ప్రెసిడెంట్ అశోక్, చిన్న కలికిరి మాజీ సర్పంచ్ భాస్కర్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గుర్రప్ప నాయుడు తదితరులు

పుత్తూరులో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు సందర్భంగా అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, యుఎస్ఏ వారి ఆర్థిక సహకారంతో డాక్టర్ శ్రీనివాసరెడ్డి ,డిస్టిక్ లెప్రసీ ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ మరియు డాక్టర్ రవి రాజు రిటైర్డ్ డిఐఓ ఆధ్వర్యంలో పౌష్టికాహార నిమిత్తం 20 మంది టీబీ రోగులకు దాతలు అయినటువంటి అడాప్ట్ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, అమెరికా వారు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి రాజు మరియు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి రోగులకు క్షయ వ్యాధి లక్షణాలు వివరించారు రెండు వారాలకు మించి దగ్గు ఉండడం గళ్ళతో పాటు రక్తం పడడం, తరచుగా జ్వరం రావడం, ఛాతిలో నొప్పి రావడం, బరువు తగ్గడం ఆకలి మందగించడం వాటి గురించి వివరించారు. క్షయ వ్యాధి క్రమం తప్పకుండా ఆరు నెలలు వాడినట్లయితే తప్పక నయమవుతుందని వివరించారు. పౌష్టికాహార నిమిత్తం రోగులకు ప్రతినెల 1000 రూపాయలు చొప్పున ఆరు నెలకి 6000 రూపాయలు వారి వారు బ్యాంక్ అకౌంట్లో జమ చేయడం జరుగును. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిస్టిక్ ఎయిడ్స్ టిబి కంట్రోల్ ఆఫీసర్, డాక్టర్ రవి రాజు రిటైర్డ్ డిఐఓ మరియు టీవీ యూనిట్ సిబ్బంది సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది , వైద్య మరియు వైద్యేతర సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే: డాక్టర్ పూజిత

విశాలాంధ్ర-రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణులు పూజిత మరియు సాయిశ్రీ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ప్రతి ఒక్కరూ తమ జీవన శైలి మార్చుకోవాలని సమతుల్యం పాటించి పోషకాలు కలిగిన పౌష్టికాహారం తో పాటు తగినంత వ్యాయామం చేయాలని మరియు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు మరియు చంద్రామణి కృష్ణ ప్రమీల కృష్ణ వేణి మరియు ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలం లోని చారాల సచివాలయం సమీపంలో రాత్రి జరిగిన ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుని కథనం మేరకు రాత్రి సుమారు 8 గంటల సమయం లో జంగాలపల్లి బస్టాప్ నుండి ఇంటికి నడుచుకొని వెళ్తున్న కుళ్లాయి వెంకటరమణ ను చౌడేపల్లి నుండి పలమనేరు వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం వెంకనుండి బలంగా ఢీ కొట్టినది, ఈ ప్రమాదం లో వెంకటరమణ కుడికాలు పాదం పైన పిక్క వద్ద వేమూక పూర్తిగా విరిగినది, వెంకటరమణ గట్టిగా అరవగా గ్రమస్తులు వచ్చి అతడిని 108లో చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తలరించారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి కుడి కాలు విరిగినదని చెప్పారు. రెండురోజులు చేకిత్స అందించి వీలైతే తిరుపతికి పంపిస్తామని తెలియజేశారు. ఈ ప్రమాదం పై వెంకటరమణ కుమార్తె ఉత్తరాది గీత ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్సై నాగేశ్వరావు తెలిపారు.

ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర-రొంపిచెర్ల: ప్రజలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రొంపిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, డాక్టర్ వినయ్ తెలిపారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందితో కలిసి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పురవీధులలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం- మన ధ్యేయం, తల్లి శిశువుల ఆరోగ్యం మన కర్తవ్యం అంటూ నినాదాలు చేశారు. ఆరోగ్య రక్షణ పై గ్రామాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తప్పనిసరిగా ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎండలు విపరీతంగా కాస్తున్నా యని, ప్రజలు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బందికి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర-గంగవరం: ప్రపంచ ఆరోగ్య దినం సందర్భంగా సోమవారం మండల డాక్టర్ జె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆరోగ్యకరమైన ప్రారంభం- ఆశాజనక భవిష్యత్తు అనే నినాదంతో ప్రపంచ ఆరోగ్య దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన వెంట డాక్టర్ లహరి వైద్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిరవహించారు. అనతరం కోటమండపం వద్ద మూడు ప్రదక్షిణలు చేసి అక్కడస్వామి అమ్మవార్లకు విశేష నైవేద్యం, మంత్రపుష్పం, దీపారాధన, హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

శ్మశానాల అభివృద్ధికై కమిషనర్‌కు వినతి

విశాలాంధ్ర-పుత్తూరు: పట్టణ పరిధిలోని అన్ని గ్రామాల శ్మశానాలను అభి వృద్ధి చేయాలని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ గౌడ్‌కు సోమ వారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు పట్టణ పరిధిలో 49 శ్మశానాలు ఉండగా అన్నింటిలోనూ ముళ్ల కంపలు పెరిగిపోయి చెత్తాచెదారంతో నిండిపోయి ఉన్నాయని, అన్నింటిని శుభ్రపరచాల్సి ఉందన్నారు. అలాగే పలు శ్మశానాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకోసం ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు సైతం చేపడుతున్నారని తెలిపారు. అలాగే 10 శ్మాశానాల్లో బోర్లు వేసి మోటర్లు బిగించకుండా వదిలేశారని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇకనైనా స్పందించి అన్ని శ్మశానాలను అనేక సమస్యలపై అభివృద్ధి చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని స్పష్టం చేశారు.

ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్ స్కూల్ నందు ఒకటో తరగతి నుండి 5వ తరగతి వెళ్తున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమంను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా పాఠశాల కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి విచ్చేసి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు విద్యార్థులకు అందించి, ఆశీర్వదించారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు ఇదొక ఆనంద పండగ లాంటి కార్యక్రమం అన్నారు. తమ పిల్లలు ఒకటో తరగతి నుంచి 5వ తరగతికి వెళ్లేటప్పుడు జరిగే ఈ కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఇలాగే విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత స్థాయిలో ఎదిగి శ్రీకాళహస్తి పేరుని ప్రపంచ స్థాయిలో నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిజాయితీ నిబద్ధతే నిలకడగా ఉంటుంది

వెంకటగిరి నియోజక వర్గ వైసిపి సమన్వయ కర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-గూడూరు: ఈనెల 9న జరగనున్న వెంకటగిరి పురపాలక సంఘం కౌన్సిల్ అవిశ్వాస తీర్మానంలో వైసిపి విజయం సాధిస్తుందని వెంకటగిరి వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి పురపాలక ఎన్నికలలో వైసిపి ఘన విజయం సాధించిందన్నారు. అయితే టీడీపీ నేతలు కావాలనే అవిశ్వాస తీర్మానం పెట్టి, కౌన్సిల్లో గందరగోళం సృష్టించాలని కుట్ర పన్నుతున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఈనెల 9న వెంకటగిరి మున్సిపాలిటీకి అవిశ్వాస తీర్మానం నిర్వహించాలని ఉత్వర్వులు జారీ చేశారు. ఈ ఎన్నికను వాయిదా వేయాలని కుట్ర తో టీడీపీ ప్రయత్నిస్తుందని, ఆదివారం నుంచే పలువురు కౌన్సిలర్ల ఇళ్లకు వెళ్లి బెదిరింపులకు పాల్పడడంతో పాటు, పోలీస్ స్టేషన్లకు పిలిపించడం ఎంత వరకు సబబు అన్నారు. వారి బెదిరింపులకు, ప్రలోభాలకు వైసిపి కౌన్సిలర్ల ఎవ్వరూ లొంగలేదన్నారు. ఎన్నికను కలెక్టర్ అదేశాల మేరకు యధావిధిగా ఈనెల 9వ తేదిన నిర్వహించాలని కోరారు. జమిలి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసిపి దే విజయమని, జగన్మోహన్ రెడ్డి సిఎం కావడం తథ్యమని చెప్పారు. ఈయన వెంట ఉమ్మడి నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలి

విశాలాంధ్ర-గుడిపాల: ఆరోగ్య నియమాలు పాటిస్తే మానవునికి ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని గుడిపాల పీహెచ్సీ వైద్యాధికారిని సంధ్య అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని పీహెచ్సీ వద్ద ప్రజలు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆమె వివరించారు ప్రతి ఒక మనిషి కూడా పోషకాలు నిండిన కలుషితం కానీ ఆహారంతో పాటు ఎలాంటి చెడు అలవాట్లకు పాల్పడకుండా ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడిన సత్వరం వైద్యం పొందాలని తెలిపారు ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని ఎండ సమయంలో బయట తిరిగొద్దని మంచి నీళ్లు మజ్జిగ, నిమ్మరసం వంటివి ప్రతి ఒక్కరు పక్కన పెట్టుకోవడం తరచూ సేవిస్తూ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాల సూర్యనారాయణ సిహెచ్ఓ విజయ హెల్త్ సూపర్వైజర్లు ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

వేము కళాశాలలో నూతన వరవడికి శ్రీకారం

కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు

విశాలాంధ్ర-పూతలపట్టు: వేము ఇంజనీరింగ్ కళాశాలలో నూతన వరవడి మొదలవుతుందని కళాశాల చైర్మన్ చంద్ర జయకర్ నాయుడు అన్నారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచనలతో ఏఐసిటిఈ సహకారంతో ఐడియా ల్యాబ్ ను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన వివరించారు దీని ద్వారా వినూత్న ఆలోచన గల యువత స్వయంగా అభివృద్ధి పథంలో పయనించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు ఇందుకోసం ఇండియా మొత్తం 15 ఇంజినీరింగ్ కళాశాలలను ఎంపిక చేయగా వేము ప్రారంభించను మన్నారు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే పదివేల ఆటోలను వాహనాలుగా వాహనాలుగా తయారు చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పుకొచ్చారు కళాశాల ముందు వాహనాల వాహనాలకు చార్జింగ్ పాయింట్ కూడా ఏర్పాటు చేయనున్నమని అన్నారు. గ్రామీణ ప్రాంతం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా ఇంజనీరింగ్ కళాశాలతో పాటు డి ఫార్మసీ బీబీ ఫార్మసీ కళాశాలను కూడా ప్రారంభించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి తెలిపారు. ఇప్పటికే నూతన భవనం కూడా అందుబాటులో ఉందన్నారు. గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలని ఆయన కోరారు.

గోవింద ధామం భూమి పూజ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చంద్రగిరి: స్థానిక శాసనసభ్యులు పులి వర్తినాని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తో కలిసి మంగళవారం ఉదయం నిర్వహించే గోవింద దామం భూమి పూజ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని జడ్పిటిసి మాజీ సభ్యులు వీరంగారి రమేష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దశాబ్దాల కాలంగా స్థానిక ప్రజలకు స్మశాన వాటిక సౌకర్యం లేక స్వర్ణముఖి నదీ పరివాహక ప్రాంతంలో అష్ట కష్టాలకోర్చి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజల కష్టాలుకు చలించి ఎన్నికల సందర్భంగా శాసనసభ్యులు పులి వర్తి నాని ఇచ్చిన హామీ మేరకు మంగళవారం గోవింద దామం ఏర్పాటుకు తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ తో కలిసి భూమి పూజ నిర్వహించనున్నారు. శ్రీనివాస మంగాపురం రహదారిలో మంగళవారం ఉదయం 8.30 గం.లకు జరిగే ఈ కార్యక్రమానికి చంద్రగిరి మండల ప్రజలు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పై తెలిపిన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కి వినతి

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి జిల్లా పరిధిలోని గూడూరు రూరల్ మండలం చెన్నూరు పాత గిరిజన కాలనీలో అడ్డూరు రమణమ్మ మరియు ఆమె భర్త వేణు పై అర్ధరాత్రి 12 గంటలకు నిద్ర అవస్థలో ఉన్న పై వారిపై స్థానిక రౌడీ మూకలు ఆమెను రేప్ చేయాలని ఉద్దేశంతో ఆమెపై దూకగా పక్కనే ఉన్న భర్త అడ్డుకోవడంపై అతనిని అతని భార్యని దుండగులు చిత్రవధ చేశారు. అనంతరం ఆ విషయం మన దృష్టికి మరియు ఇతర సంఘాల దృష్టికి రాగానే ఆ కాలనీకి వెళ్లి వారికి ధైర్యం చెప్పి పోలీస్ కేసు పలు సెక్షన్ కింద అలానే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పిఓఏ ఆక్ట్ ప్రకారం నమోదు చేయించి దాదాపు రెండు సంవత్సరంలవుతున్న అనేక సార్లు తిరుపతి జిల్లా కలెక్టరేట్ చుట్టూ పలుమార్లు అర్జీలు ఇచ్చిన వారికి రావాల్సిన అట్రాసిటీ యాక్ట్ కాంపెన్సేషన్ ఇప్పటివరకు అందనందున మరల కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించడం అయినది. స్పందించిన వారు త్వరలోనే కంప్లిసేషన్ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజనుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బి ఎల్ శేఖర్ బాధితులు వేణు రమణమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి.. ప్రమాదాల నుండి కాపాడండి

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండల కేంద్రం నుండి పుంగనూరుకు వెళ్లే రహదారిలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని మండల ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ రోడ్డులో వాహనాలు అతివేగంతో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురి అవుతున్నాయి. ప్రతిరోజు ఏదో ఒక సమస్యతో వాహనాలు అదుపుతప్పు తున్నాయి. ఇటు చెక్పోస్ట్ కూడలి నుండి ఎమ్మార్వో ఆఫీసు సచివాలయము అగస్తి పబ్లిక్ స్కూల్ వరకు పాదచారులు విద్యార్థులు ఈ రోడ్డులో రద్దీగా ఉంటారు అదేవిధంగా గంగమ్మ గుడి నుండి పోలీస్ స్టేషన్, మధ్య బస్టాండు, హైస్కూలు, చెక్ పోస్ట్ వరకు కూడా స్పీడ్ బ్రేకర్లను వేయాలి.భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనాలలో ప్రయాణించేవారు అతివేగంతో ప్రయాణిస్తున్నారు. టౌన్ లిమిట్స్ లో 20 లేదా 30 కిలోమీటర్ల వేగంతో రావలసి ఉండగా వాహనాలు 60 70 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తూ ఉన్నాయి. దీనివలన ప్రమాదాలు జరుగుతున్నాయి, దీన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత రోడ్లు భవనాల శాఖ వారు ఎమ్మార్వో ఆఫీసు,ఆగస్తి పబ్లిక్ స్కూలు, సచివాలయము, చెక్ పోస్ట్ కూడలి వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయాలని మండల ప్రజలు తెలియజేస్తున్నారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు ఎంపిపి వినతి

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మండల పరిషత్ అభివృద్ధి పనులపై తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లును సోమవారం పుత్తూరు ఎంపీపీ మునివేలమ్మ, కోఆప్షన్ నంబర్లు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మునివేలమ్మ మాట్లాడుతూ పుత్తూరు మండల పరిషత్ అభివృద్ధి పనులపై, మండలంలో వున్న సమస్యలను కలెక్టర్ కు వివరించారు. అందులో మండల పరిషత్ లో సుమారు 70 లక్షల రూపాయలు నిధులు నిరుపయోగంగా వున్నాయని, అభివృద్ధి పనులు చేయకుండా అదికారులు కాలయాపన చేస్తున్నారని తెలిపారు. అలాగే గత కొన్ని నెలలుగా ప్రభుత్వ కార్యక్రమాలకు మండల స్థాయి అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని, కనీసం కార్యాలయంకు వచ్చినా ఏ అధికారులు అందుబాటులో ఉండడం లేదని కలెక్టర్ కి ఎంపిపి మునివేలమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో కో - ఆప్షన్ నెంబర్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం శ్రీ స్వామి వారి సేవలో ప్రముఖులు

విశాలాంధ్ర-చిత్తూరు: స్వయంభు శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం శ్రీ స్వామి వారిని దర్శించుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు శాంతారామ్ మరియు ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్. మునిరత్నం, స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈవో పెంచల కిషోర్, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరిండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన ఫీచర్‌తో అర్బన్ క్రూయిజర్ హైరైడర్

విశాలాంధ్ర-తిరుపతి: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) అర్బన్ క్రూయిజర్ హైరైడర్‌లో భద్రత, సౌకర్యం, సౌలభ్యాన్ని పునర్నిర్వచించే ఫీచర్ అప్‌గ్రేడ్‌లను ప్రవేశపెట్టినట్లు సేల్స్-సర్వీస్-యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్-ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్యూవీగా గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే 1 లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటింది. ఇది దాని వినూత్న సాంకేతికత, అసాధారణమైన ఇంధన సామర్థ్యం, శక్తివంతమైన పనితీరు, ప్రీమియం డ్రైవింగ్ అనుభవంతో హృదయాలను గెలుచుకుంటూనే ఉంది అన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ లో ఇప్పుడు ప్రధానంగా మెరుగైన భద్రత ఫీచర్లు. ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తూ 6 ఎయిర్‌బ్యాగ్‌లు ఇప్పుడు అన్ని వేరియంట్‌లలో ప్రామాణికంగా ఉన్నాయి. అలాగే ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌కు ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ జోడించబడింది. సౌకర్యం కోసం 8-వే అడ్జస్టబుల్ పవర్ డ్రైవర్ సీట్, యాంబియంట్ లైటింగ్, క్యాబిన్ లోపల మెరుగైన గాలి నాణ్యత పర్యవేక్షణను నిర్ధారిస్తూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ డిస్ప్లే జోడించబడిందన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ కోసం బుకింగ్‌లు ఇప్పుడు తెరవబడ్డాయి. కస్టమర్‌లు తమ సమీప టొయోటా డీలర్‌షిప్‌ను సందర్శించవచ్చు లేదా టయోటా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ ఎస్‌విబిసి చైర్మన్‌కు నేదురుమల్లి పరామర్శ

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి రాజా కుటుంబీకుడు, మాజీ ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వివి సాయికృష్ణ యాచేంద్ర వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్పిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. సాయి కృష్ణ యాచేంద్ర ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై చికిత్స పొందిన నేపథ్యంలో నేదురుమల్లి ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇంకా రాజా కుటుంబీకుడు సర్వజ్ఞ కుమార యాచేంద్రతో పలు అంశాలను చర్చించారు.

గ్లోబల్ ఫౌండేషన్ యూఎస్ఎ సహకారంతో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ యూ ఎస్ ఎ వారి ఆర్థిక సహకారంతో డిస్టిక్ లెప్రసీ, ఎయిడ్స్, టీబి ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ డిఐఓ డాక్టర్ రవి రాజు ఆధ్వర్యంలో 20 మంది టీబీ రోగులకు దాతలు అయిన అడాప్ట్ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్, అమెరికా వారు.పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి రాజు, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డిలు రోగులకు క్షయ వ్యాధి లక్షణాలు వివరించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, గళ్ళతో పాటు రక్తం పడడం, తరచుగా జ్వరం రావడం, చాతిలో నొప్పి రావడం, బరువు తగ్గడం ఆకలి మందగించడం వంటి లక్షణాలు గురించి వివరించారు. క్షయ వ్యాధి క్రమం తప్పకుండా ఆరు నెలలు మందులు వాడినట్లయితే తప్పక నయమవుతుందని వివరించారు. పౌష్టికాహార నిమిత్తం రోగులకు ప్రతినెల వెయ్యి రూపాయలు చొప్పున ఆరు నెలలకి ఆరు వేల రూపాయలు వారి వారి బ్యాంక్ అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డిస్టిక్ ఎయిడ్స్ టిబి కంట్రోల్ ఆఫీసర్, డాక్టర్ రవి రాజు, టీవీ యూనిట్ సిబ్బంది, సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్య వైద్యేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-పుత్తూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటర్ ద్వితీయ సంవత్సరం 2025 - 26 చదువుతున్న విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పట్టణంలోని ఎస్ ఆర్ ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు తరగతులు ప్రారంభించారు. దీంతోపాటు విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ ఆదేశాలతోఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దరిశా గోపాల్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థినీ,విద్యార్థులకు అందించారు. ఇంకను కళాశాలకు రాని విద్యార్థులు కళాశాలకు వచ్చి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను తీసుకొని కళాశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఏకాంబరాచారి, నిరంజన్, అమ్ము దేవి, రమాదేవి, సునీత, చక్రధర్, అపరంజి, కేశవ రెడ్డి, ఆర్ పి, సీనియర్ సహాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకం శ్రీ స్వామివారి దేవస్థానం అభివృద్ధికి రూ.1.5 లక్షల విరాళం

విశాలాంధ్ర-పూతలపట్టు: స్వయంభు శ్రీవరసిద్ధ వినాయక స్వామి వారి దేవస్థానం కాణిపాకం శ్రీ స్వామివారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్ కి విరాళం లక్ష రూపాయలు మరియు గోశాల ట్రస్ట్ కు విరాళం 50 వేల రూపాయలు మొత్తం ఒక లక్ష యాభై వేలు దాతలు సిహెచ్ రవిశంకర్, వారి కుటుంబ సభ్యులు హైదరాబాద్ వాస్తవ్యులు వీరికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేసిన ఆలయ ఏఈవో రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కురుగొండ్ల

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పట్టణంలోని తెలుగుదేశం కార్యాలయం నందు తెలుగుదేశం సభ్యత్వ కార్డులను వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల మండల అధ్యక్షులు, తిరుపతి పార్లమెంట్, పట్టణ కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, బూత్ ఇంచార్జిలు, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అవిశ్వాసం ప్రశాంతమైన వాతావరణం జరిగేలా చూడండి

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి అవిశ్వాస తీర్మాణ ప్రొసీడింగ్ ఆఫీసర్ గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా కి వైఎస్ఆర్పిపి పార్టీ తరపున విప్ పత్రాలను అందజేసి వెంకటగిరిలో జరగనున్న అవిశ్వాస తీర్మానం ప్రశాంత వాతావరణంలో జరిగే లాగా చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్పిపి వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, గూడూరు సమన్వయకర్త మెరుగ మురళి కోరారు.

ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర-పుత్తూరు: భారతీయ జనతా పార్టీ నగిరి నియోజవర్గం పుత్తూరు మండలంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించిన జెండాను, ద్రౌపతమ్మ గుడి సమీపంలో వున్న పాత బస్టాండ్ వద్ద బీజేపీ ఆవిర్భావ దినోత్సవానికి బిజెపి మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు యం.నిషీధ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిషీధ రాజు మాట్లాడుతూ బీజేపీ 45 సంవత్సరాలు పూర్తి చేసుకుని 46 వ సంవత్సరానికి అడుగుడుతూ వున్న సందర్భంగా పుత్తూరు మండలంలో ఏనాడు లేని విధంగా పుత్తూరు మండలం కార్వేటి నగర్ సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించబడిన భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరించడం జరిగిందన్నారు. అలాగే బీజేపీ పార్టీ ఆవిర్భావ సందర్భంగా స్థానిక శివాలయం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, ఆపస్ గౌరవ అధ్యక్షులు మేకల సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ నాయుడు, గుండ్రాజు కుప్పం సర్పంచ్ బాలి రెడ్డి, మునికృష్ణా నాయుడు, వేలాయుధం, భక్త, పొన్ను స్వామి, రామమూర్తి, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీధర్, మాజీ మండలం ఉపాధ్యక్షుడు మధు, చిత్తూరు జిల్లా ఓబీసీ కార్యదర్శి శంకర్, మండలం ప్రధాన కార్యదర్శులు మునస్వామి, గణేష్ ఓబిసి మండల అధ్యక్షుడు హరి పుత్తూరు మండలం మాజీ బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు భువనేశ్వరి మహిళా మోర్చా నాయకులు వేదవల్లి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ అర్జీలు వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు: పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివిద శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ మోహన్ కుమార్, చిత్తూరు ఆర్డి ఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ ఎస్ అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పని చేయాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాదానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగుతుం దని,ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతివారం సమీక్షించడం జరుగు తుందని, అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జిల్లా కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డిఓ, డిప్యూటీ కలెక్టర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ పఖ్వాడాకు

సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్: పోషణ్ పఖ్వాడా కార్యక్రమం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 7వ పోషణ్ పఖ్వాడా ఏప్రిల్ 8 నుండి ప్రారంభమై 22వ తేదీ వరకు నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యలయం నందు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఐసిడిఎస్, ఆర్డబ్ల్యూఎస్ వైద్యశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 8 నుండి ఏప్రిల్ 22 వరకు పోషణ పఖ్వాడా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో నిర్వహించి సఫలీ కృతం చేయాలన్నారు. నిర్వహణపై తగిన సూచ నలు జారీ చేశారు. పోషణ్ అభియాన్లో భాగమైన పౌష్టిక ఆహారం లోని పోషక విలువలను, ఆరోగ్యకరమైన ఆహారం స్వీకరణ అంశా లపై పూర్తిస్థాయిలో అవగాహనను ప్రోత్స హించడమే లక్ష్యంగా, గర్భవత్తులు, బాలింతలు, పిల్లలు, కౌమార బాలికలు పోషకాహార స్థితిలో మెరుగుదల సాధించడానికి ప్రధానమంత్రి 'పోషణ్ అభియాన్ ను ప్రారంభించారన్నారు. అప్పటి నుండి, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పోషణ్ పఖ్వాడాను జరుపుతోందన్నారు. ప్రతి సంవత్సరం మార్చి నెలలో 15 రోజుల పాటు పోషణ్ పఖ్వాడ జరుపుకుంటారనీ జిల్లాలో తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి, వారికి ప్రత్యేక శ్రద్ధ, పోషణను అంగన్వాడి కేంద్ర పరిధిలోని పోషణ పెక్వాడ గరిణీల పోషకాహారం తీసుకుంటే పండంటి బిడ్డకు జన్మనిస్తారని, అలాగే ప్రతి రోజు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల తల్లులకు ఇచ్చిన గ్రోత్ కార్డులలో బరువు సూచించిన విధంగా ఉండాలని ప్రతి నెల పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి తీసుకువచ్చి పిల్లల బరువు, ఎత్తు తనిఖీ చేయించి వారి ఎత్తు బరువు, పెరిగేలా చూడాలన్నారు. అలాగే ప్రీ స్కూల్ కు వచ్చే పిల్లలను ఐదు సంవత్సరాల వరకు అంగన్వాడి కేంద్రాలకు వంపిస్తే ఆటపాటల విద్యతో పాటు అంగన్వాడి టీచర్లు పిల్లలను తల్లులుగా చూసుకోవాలన్నారు. పోషణ వక్షంలో భాగంగా చిరుధాన్యాలపై తల్లులకు కిశోర బాలికలకు అవగాహన పెంపొం దించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రాలలో జరిగే అవగాహన కార్యక్రమాల్లో గర్భిణీలు బాలింతలు చిన్న పిల్లలు తీసుకోవలసిన వ్యాక్సినేషన్ హెల్త్ చెకప్ గురించి నవజాత శిశువు గురించి తీసుకో వలసిన జాగ్రత్తల గురించి వారి బరువు తల్లిపాల ప్రాముఖ్యత, బరువు తక్కువ పిల్లలకి జిల్లాస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి డాష్ బోర్డులో యాక్టివిటీస్ని అప్లోడ్ చేయాలని ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో, గ్రామ, మండల, ప్రాజెక్టు జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని పరిశుభ్రమైన త్రాగునీరు, మరుగుదొడ్ల వాడుక గురించి అవగాహన కల్పించాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారుల ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో ఐసిడిఎస్ పిడి వసంతా బాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

- కలెక్టర్‌కు పూతలపట్టు ఎమ్మెల్యే వినతి

విశాలాంధ్ర - చిత్తూరు : జిల్లా సచివాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పూతలపట్టు ఎంఎల్ఏ కె.మురళిమోహన్ విచ్చేసి నియోజకవర్గం లోని సమస్యలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు నేరుగా తెలిపారు.ఈ సందర్భంగా పూతలపట్టు ఎంఎల్ఏ మాట్లాడుతూ నియోజకవర్గంలో భూ సమస్యలు ఉన్నాయని, ఇందులో భాగంగా తవణంపల్లి ఏ.గొల్లపల్లి ఎస్సి కాలనీలో దాదాపుగా 50 సం.ల నుండి నివసిస్తున్న వారి గృహాలకు ప్రభుత్వ గుర్తింపు, ధృవీకరణ లేదని, ఈ పరిస్థితిలో వారి వారసులకు భవిష్యత్తులో గృహాల పై హక్కులను తర్జుమా చేసే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం భూ వివరాలు ఆన్ లైన్ నందు నమోదు చేస్తున్న తరుణంలో సదరు గ్రామస్తుల భూ వివరాలను ఆన్ లైన్ చేసి వారికి తోడ్పాటును అందించాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా . స్పెషల్ ఆఫీసర్ ను నియమించి 20 నుండి 25 రోజులలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుం టామని కలెక్టర్ తెలిపారన్నారు. బంగారుపాలెం మండల కేంద్రం లో దాదాపు వెయ్యి కుటుంబాలు ఎస్సి వర్గానికి చెందిన వారు నివాసిస్తున్నారని, అంతిమ సంస్కారానికి భూమి లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని, శ్మశానవాటిక ఏర్పాటుకు భూమిని కేటాయించాలని కోరగా శ్మశాన వాటిక ఏర్పాటుకు అవసరమైన భూమి కొనుగోలుకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించేలా చేపడతామని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు అందించనున్నదని,ఇళ్లనిర్మాణానికిఆర్థికసహాయంచేయనున్నదని తెలిపారు.

టీటీడీకి రూ.కోటి విరాళం

టీటీడీ నిర్వహిస్తున్న వివిధ పథకాలకు సోమవారం రూ.కోటి విరాళంగా అందింది

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : ఒడిశాకు చెందిన శివమ్ కాండేవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.20 లక్షలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.20 లక్షలు, స్విమ్స్ ట్రస్టుకు రూ.20 లక్షలు, ఎస్వీ సర్వ శ్రేయాస్ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించింది. అదే రాష్ట్రానికి చెందిన బలభద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా ఇచ్చింది. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగ నాయకులు మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ కంపెనీల ప్రతినిధి వై.రాఘవేంద్ర విశ్వకర్మ విరాళం డీడీలను అందజేశారు.

అక్రమార్కులకు అండగా తహసీల్దారు

తహశీల్దారు అవినీతిపై కలెక్టర్ కు ఫిర్యాదు

జిల్లా కలెక్టర్‌ను కలసి ఫిర్యాదు చేసిన తిరుపతి రూరల్ ఎంపీపీ

విశాలాంధ్ర - తిరుపతి కలెక్టరేట్ : తిరుపతి రూరల్ మండలం పరిధిలోని కోట్లాది రూపాయల విలువచేసే ప్రభుత్వ భూములను అక్రమార్కుల చేతుల్లోకి చేర్చి అవినీతికి పాల్పడుతున్న తిరుపతి రూరల్ తహశీల్దారు రామాంజులు నాయక్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు తిరుపతి రూరల్ ఎంపీపీ, వైస్ ఎంపీపీ తదితరులు ఫిర్యాదు చేశారు. ఈ సదర్భంగా ఎంపీపీ మూలం చంద్ర మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ భూ ఆక్రమణదారులకు తిరుపతి రూరల్ మండలం తహశీల్దారు రామాంజులు నాయక్ అండగా నిలబడటంతో తరతరాలుగా కాపాడుకుంటూ వచ్చిన భూములన్నీ అక్రమార్కుల పరం అవుతున్నాయని ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన తహశీల్దారు భూ ఆక్రమణకు సంబంధించి ఎవ్వరు సమాచారం ఇచ్చినా వారి వివరాలను క్షణాల్లో ఆక్రమణ దారులకు అందజేస్తున్నారంటే ఆయన ఏరకంగా వారితో లాలూచీ పడ్డారో గమనిం చాలన్నారు. తిరుపతి రూరల్ తహశీల్దారుగా రామాంజుల నాయక్ వచ్చినప్పటి నుంచి ఆక్రమణదారుల చెంతకు చేరిన ప్రభుత్వ భూములు, మఠం, భూములు, ఇనాం భూములు, కాలువ భూములు, చెరువు భూముల వివరాలను కలెక్టర్‌కు అంద జేశారు. అలాగే ప్రభుత్వ భూముల దురాక్రమణలకు సంబంధించి ప్రతిరోజు దినపత్రికల్లో వార్తలు ప్రచురించినప్పటికీ తహశీల్దారు స్పందించడం లేదన్నారు. ఆ భూ ఆక్రమణల గురించి ప్రచురించిన వార్తా పత్రికల క్లిప్పింగ్ లను కూడా కలెక్టర్‌కు అందజేశారు. ప్రభుత్వ భూములను సెంట్లు లెక్కన, ఎకరాల లెక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ ఆక్రమణ దారులతో బేరం పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్టు సాక్షాలు కూడా తమ దగ్గర వున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరుపతి నగరానికి ఆనుకుని వున్న కోట్ల రూపాయల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతుంటే కాపాడాల్సిన తహశీల్దారు తన వద్ద వున్న రికార్డులు కూడా మార్చేసి అక్రమార్కులకు అండగా నిలబడుతున్నారన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఫిర్యాదు చేసినా లెక్క చేయడం లేదని, ప్రభుత్వ భూములు కాపాడే విషయంలో ఆయన తీరు సరిలేదని పలు మార్లు ఆయనను కలసి వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే అధికారి అక్రమార్కులతో లాలూచీ పడినట్టు ప్రజా ప్రతినిధులైన తమ పరిశీలనలో నిర్ధారణ కావడంతో ఆ వివరాలను కలెక్టర్ వద్దకు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి తిరుపతి రూరల్ తహశీల్దారుపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, అలా చేయని పక్షంలో ప్రజలందరితో కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన దీక్షలు, నిరాహార దీక్షలు చేపట్టడానికి సిద్ధంగా వున్నట్టు తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడటానికి తమ వంతు బాధ్యత తీసుకున్నామని, ఆక్రమణలు, అక్రమాలకు సంబంధించిన అన్ని వివరాలను కలెక్టర్‌కు తెలియపరిచామన్నారు. పది రోజుల సమయం తరువాత ప్రత్యక్ష ఆందోళ నలకు సిద్ధమవుతున్నట్టు చెప్పారు. ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదు స్వీకరించిన కలెక్టర్ పూర్తి స్థాయి విచారణకు ఆదేశిస్తున్నానని, జిల్లా జాయింట్ కలెక్టర్ విచారణ చేసిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో వైస్ఎంపీపీలు మాదవరెడ్డి, యశోద, జడ్పీటీసీ రత్నమ్మ,సర్పంచ్ చిన్నయాదవ్‌లతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వున్నారు.